క్లుప్తంగా

గూడు కూలింది.. గోడు వినేవారెవరు?

మణుగూరుటౌన్: మున్సిపాలిటీలోని రాజుపేటలో ఇటీవల కురిసిన వర్షానికి ఇంటి గోడ కూలడంతో నిరుపేద వృద్ధ దంపతులు పడుతున్న ఇబ్బందులు వర్ణనాతీతంగా మారాయి. బాధితుల కథనం ప్రకారం.. రాజుపేటకు చెందిన రాము అనే వృద్ధుడు రోజు కూలీగా పనిచేసుకుంటూ దివ్యాంగురాలైన తన భార్య విమలతో ఓ గదిలో నివాసం ఉంటున్నాడు. ఈ క్రమంలో ఈనెల 13న కురిసిన భారీ వర్షం ధాటికి ఇంటి గోడ కూలడంతో ఉన్న ఒక్క గదిలో నివాసం ఉండలేని పరిస్థితి నెలకొంది. విషయం తెలుసుకున్న మున్సిపాలిటీ అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి ఇళ్లు ప్రమాదకరంగా మారిందని, ఇందులో ఉండొద్దని నోటీసులు అందించారు. వృద్ధ దంపతులు తమను ఆదుకోవాలని కోరగా, ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేస్తామని హామీనిచ్చారు. అయితే ఈ విషయమై కార్యాలయం చుట్టూ తిరిగినా ప్రయోజనం లేకపోయింది. సమీపంలోని ఓ కుటుంబం వారిని అక్కున చేర్చుకోవడంతో ప్రస్తుతం అక్కడే నిద్రిస్తున్నారు. దరఖాస్తు రాసుకుని ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లుకు అందించేందుకు మూడు రోజులుగా ప్రయత్నించినా ఫలితం లేదు. తమకు న్యాయం చేసి, ఆదుకోవాలని వేడుకుంటున్నారు.

వాహన తనిఖీలు

దుమ్ముగూడెం: నేటి నుంచి అక్టోబర్ 20 వరకు జరిగే మావోయిస్టు పార్టీ 21వ వార్షికోత్సవాల నేపథ్యంలో సీఐ వెంకటప్పయ్య ఆధ్వర్యంలో పోలీసులు ముమ్మరంగా శనివారం వాహన తనిఖీలు చేపట్టారు. మండలంలోని పెద్దబండిరేవు,సీతానగరం,పెద్దనల్లబల్లి ప్రధాన రహదారిపై వెళ్లే వాహనాలను నిలిపి తనిఖీలు చేస్తున్నారు. అనుమానిత వ్యక్తుల వివరాలను అడిగి తెలుసుకుంటున్నారు. అటవీప్రాంత గ్రామాల్లో గాలింపు చర్యలు చేపడుతూ.. అనుమానిత వ్యక్తుల సంచారం ఉంటే పోలీసులకు సమాచారం అందజేయాలని సూచిస్తున్నారు. కాగా రెండు రోజుల క్రితం చర్ల, దుమ్ముగూడెం మండలాల్లోని కొంతమంది రాజకీయ నాయకులను హెచ్చరిస్తూ మావోయిస్టులు లేఖ విడుదల చేయడంతో ముందస్తుగా రాజకీయ పార్టీల నాయకులు లోపలి గ్రామాల పర్యటనకు వెళ్తే సమాచారం అందించాలని సూచనలు చేస్తున్నారు.

నిర్వాసిత గ్రామాలుగా గుర్తించాలి

మణుగూరుటౌన్: సింగరేణి అధికారుల నిర్లక్ష్యం వల్ల రాజుపేట, విఠల్‌రావునగర్, కోటకట్ట గ్రామాల ప్రజలు దుమ్ముధూళితో ప్రాణాంతక వ్యాధులతో ఇబ్బందులు పడుతున్నాయని, ఆ మూడు గ్రామాలను నిర్వాసిత గ్రామాలుగా గుర్తించాలని మాజీ ఎంపీ మిడియం బాబురావు అన్నారు. ఈ మేరకు శనివారం ఆందోళన నిర్వహించి సీపీఎం ఆధ్వర్యంలో సింగరేణి అధికారులకు, తహసీల్దార్ నరేశ్‌కు వినతిపత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ.. ఇళ్లు బీటలువారి దుమ్మూధూళితో అవస్థలు పడుతున్న ఈ గ్రామాలను తరలించి 2013 భూ సేకరణ చట్టం ద్వారా ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ ఇవ్వాలని, సురక్షిత ప్రాంతాలకు తరలించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి మచ్చా వెంకటేశ్వర్లు, రాష్ట్ర కమిటీ సభ్యుడు అన్నవరపు కనకయ్య, మండల కార్యదర్శి సత్రపల్లి సాంబశివరావు, సీనియర్ నాయకులు నెల్లూరి నాగేశ్వరరావు, కొడిశాల రాములు తదితరులున్నారు.

గ్రూపు తగాదాలకు ప్రయత్నిస్తున్నారు..

ములకలపల్లి: ఇతర పార్టీల నాయకులు కాంగ్రెస్ పార్టీలోకి చొరబడి తమ పార్టీలో గ్రూపు తగాదాలు సృష్టించడానికి ప్రయత్నాలు చేస్తున్నారని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు తాండ్ర ప్రభాకర్ రావు ఆరోపించారు. మండల పరిధిలోని తిమ్మంపేట గ్రామంలో పార్టీ అనుబంధ సంఘాల నాయకులతో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బీఆర్ఎస్ పార్టీకి చెందిన కొందరు ఫ్లెక్సీలు ఏర్పాటు చేసి, గ్రూపు రాజకీయాలకు తెర లేపుతున్నారని అనుమానం వ్యక్తం చేశారు. తద్వారా కాంగ్రెస్ నాయకులల్లో గందరగోళం ఏర్పరిచి, వారి మనోభావాలు దెబ్బతీసే విధంగా ప్రవర్తిస్తున్నారన్నారు. వెంటనే ఫ్లెక్సీలు తొలగించకపోతే కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేశారు. కాంగ్రెస్ నాయకులు అచ్చెన వెంకటేశ్వర్లు, ఎండి.అంజుం, శేషమటం వెంకటేశ్వర్లు, పాలకుర్తి సుమిత్, గుంటూరు సాయి, గుర్రం జయసుధ, పద్మశ్రీ పాల్గొన్నారు.

పోస్టర్ల ఆవిష్కరణ

భద్రాచలంటౌన్: భద్రాచలం పట్టణంలో ఈ నెల 28న ఆదివాసీ సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో జరగబోయే చలో భద్రాచలం ధర్మ యుద్ధం మహాసభకు సంబంధించి శనివారం పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జాయింట్ యాక్షన్ కమిటీ చైర్మన్ చూరన్న రామకృష్ణ మాట్లాడుతూ.. అన్ని ఆదివాసీ సంఘాలు నాయకులు జేఏసీగా ఏర్పడి చట్టబద్ధత లేని లంబాడాలను ఎస్టీ జాబితా నుంచి తొలగించాలని, ఒకే మాట ఒకే నినాదంతో ముందుకు వెళ్లేలా తీర్మానించామని తెలిపారు. ప్రజా పోరాటం, రాజకీయ పోరాటం, న్యాయ పోరాటంతో పాటు సంస్కృతి పోరాటం జరగాలని ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఆదివాసీ జేఏసీ నాయకులు వీరభద్రం, పోనెం కృష్ణ, కుంజ శీను, పోడియం నరేందర్, ఇర్పా అనసూయ, గనిబోయిన శీను పాల్గొన్నారు.



మధురం.. సీతాఫలం

- ప్రకృతి ఒడిలోని అమృత పండు
- దాగిఉన్న ఆరోగ్య రహస్యాలు
- గిరిజన జీవనానికి ఆదాయ వనరు

కరకగూడెం: ప్రకృతి ఒడిలో పెరిగే పంటలు, పండ్లు గిరిజన జీవనానికి జీవనాధారాలు. అలాంటి వాటిలో ప్రత్యేక స్థానం దక్కించుకున్న పండు సీతాఫలం. వర్షాభావ ప్రాంతాల్లో, రాతి మట్టిలోనూ సులువుగా పెరిగే ఈ పండు గిరిజనులకు ఆదాయ వనరుగా, పోషక ఆహారంగా మారింది.

జీవనాధారంగా..

వన్యప్రాంతాల సంపద, గిరిజనుల జీవనానికి ఆధారంగా నిలిచే సీతాఫలం ఈ సీజన్‌లో వారి జీవితాల్లో కొత్త ఉత్సాహాన్ని నింపుతోంది. సీతాఫలాలను సేకరించి, వాటిని సమీప మార్కెట్లలో విక్రయించడం ద్వారా గిరిజన కుటుంబాలు ఆర్థికంగా లబ్ధి పొందుతున్నాయి. సాధారణంగా గిరిజన గ్రామాల్లోని ఇంటింటికీ సీతాఫలం చెట్లు కనిపిస్తాయి.కానీ ఇటీవల వలస వచ్చిన ఆదివాసీ కుటుంబాలు కూడా అటవీ ప్రాంతాల్లోకి వెళ్లి, అక్కడ సహజసిద్ధంగా పెరిగిన పండ్లను సేకరించి అమ్ముతున్నారు. మార్కెట్‌లో గిరిజనులు ఒక డజను సీతాఫలాలను రూ.100కు విక్రయిస్తున్నారు. అంతేకాక సీతాఫలం రకాన్ని బట్టి రూ.3050 రూపాయల వరకు అమ్ముతున్నారు. ఇది వారికి రోజువారీ ఖర్చులు, కుటుంబ అవసరాలు తీర్చుకోవడానికి సరిపోయే ఆదాయాన్ని అందిస్తోంది. ఈ వ్యాపారంలో గిరిజన మహిళలు, యువకులు చురుగ్గా పాల్గొంటున్నారు.

పోషకాల పెన్నిధి..



చెట్టు నుంచి కోసిన సీతాఫలాలు

సీతాఫలంలో మన శరీరానికి అవసరమైన అనేక పోషకాలు సమృద్ధిగా లభిస్తాయి. ముఖ్యంగా రోగనిరోధక శక్తి పెంచడంలో ఉపయోగపడుతుంది. జలుబు, దగ్గు వంటి చిన్నపాటి అనారోగ్యాలు దూరమవుతాయి. ఇందులో ఉండే యాంటీ ఆక్సిడెంట్లు ముఖ్యంగా ఫ్లవనాయిడ్స్, కరోటినాయిడ్స్.. ఫ్రీ రాడికల్స్ వల్ల కలిగే నష్టాన్ని తగ్గించి వృద్ధాప్య లక్షణాలను ఆలస్యం చేస్తాయి. ఫైబర్, పొటాషియం, మెగ్నీషియం, ఐరన్ విటమిన్ ఏ, బీ కాంప్లెక్స్‌లు సీతాఫలంతో అందుతాయి.

తినే పద్ధతిలోనూ వైవిధ్యం..

సాధారణంగా సీతాఫలం పండును నేరుగా తిన వచ్చు. కొందరు పై తొక్కను వలిచి స్పూన్‌తో ఆస్వాదిస్తారు. అయితే, సీతాఫలం గుజ్జుతో పాలు, తేనె కలిపి స్మూతీలు, మిల్క్‌షేక్‌లు చేసుకోవడం ట్రెండింగ్‌లో ఉన్న పద్ధతి. ఇది కేవలం రుచికరమే కాకుండా పౌష్టికమైన పానీయంగా పరిగణిస్తున్నారు. అందుకే సీతాఫలాన్ని తప్పక ఆహారంలో భాగం చేసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు.

సండే స్పెషల్



గొల్లగూడెంలో సీతాఫలాలను తెంపుతున్న మహిళలు

డయాబెటిక్ రోగులకు మాత్రం పరిమితిలో తినాలి సుమా.

ఏటేటా తగ్గుతున్న చెట్లు

వన్యప్రాంతాల జీవనానికి, గిరిజనుల ఆచారాలకు, సంస్కృతికి ప్రతీకగా నిలిచే సీతాఫలం చెట్లు ఏటేటా తగ్గిపోతుండటం తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. ఒకప్పుడు వేల సంఖ్యలో కనిపించే ఈ చెట్లు ఇప్పుడు వందల సంఖ్యకు పడిపోయాయి.అడవుల నరికివేత, విస్తరిస్తున్న వ్యవసాయ భూములు, పట్టణీకరణ వల్ల సహజ సిద్ధంగా పెరిగే ఈ చెట్ల మనుగడ ప్రశ్నార్థకంగా మారింది. సమస్యను నివారించడానికి ప్రభుత్వాలు, అటవీ శాఖలు తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదివాసీలు కోరుతున్నారు.

జిల్లాలో గిరిజనాభివృద్ధి బాగుంది..

భద్రాచలంటౌన్: గిరిజనులకు కల్పిస్తున్న మౌలిక వసతుల గురించి తెలుసుకున్నానని, జిల్లాలో గిరిజనులు అభివృద్ధి బాగుందని విశ్రాంత ఐఏఎస్ ఐవీ సుబ్బారావు అన్నారు. ఐటీడీఏ ద్వారా గిరిజనులకు అందిస్తున్న వివిధ సంక్షేమ పథకాల పరిశీలనలో భాగంగా ట్రైబల్ మ్యూజియాన్ని ఐటీడీఏ పీఓ బి.రాహుల్‌తో కలిసి ఆయన శనివారం రాత్రి సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గిరిజనులు తక్కువ పెట్టుబడితో ఆదాయ మార్గాలను నిర్దేశించడం, అంతరించిపోతున్న గిరిజన సంస్కృతి, సాంప్రదాయాలు నేటితరానికి తెలిసే విధంగా మ్యూజియం రూపకల్పన చేయడం అభినందనీయం అన్నారు. అనంతరం ఐటీడీఏ ద్వారా మారుమూల ప్రాంత ఆదివాసీ గిరిజన కుటుంబాలకు వివిధ సంక్షేమ పథకాలు అందిస్తున్నామని, పై చదువులకు ఆర్థిక సహాయంతో పాటు ల్యాప్‌టాప్‌లు అందిస్తున్నామని పీఓ రాహుల్ వివరించారు. విశ్రాంతి ఐఏఎస్ సుబ్బారావు దంపతులకు ట్రైబల్ మ్యూజియం సంబంధించిన కాఫీ బుక్‌తో పాటు మెమొంటోను అందించి సత్కరించారు. కార్యక్రమంలో మేనేజర్ ఆదినారాయణ, మ్యూజియం ఇన్‌చార్జ్ వీరస్వామి, కాంతారావు, రాజు తదితరులు పాల్గొన్నారు.



మ్యూజియంలో వస్తువుల గురించి వివరిస్తున్న పీఓ రాహుల్

పీఏసీఎస్ సొసైటీకి క్షవరం..

అశ్వారావుపేట: అశ్వారావుపేట పీఏసీఎస్ కార్యదర్శిగా ఉన్న మానేపల్లి విజయ్‌బాబు సస్పెన్షన్ వెనుక అనేక కారణాలు ఉన్నట్లు తెలుస్తోంది. సస్పెన్షన్ కాపీ ప్రకారం.. 2023 మిచుంగ్ తుఫాన్ సమయంలో ధాన్యం కొనుగోలు నిర్వహించడంలో, సొసైటీని చట్ట ప్రకారం నిర్వహించడంలో విజయ్‌బాబు విఫలమయ్యారు. జూన్ 1 నుంచి జూలై 9, 2025 వరకు, ఆగస్ట్ 25 నుంచి సెప్టెంబర్, 2025 వరకు విధులకు హాజరు కాలేదు. అశ్వారావుపేట వ్యవసాయ కళాశాల నుంచి రూ.4,76,996 నగదు రావాల్సి ఉందని రికార్డులలో ఉండగా కళాశాలను సంప్రదించగా రూ.21,331 మాత్రమే చెల్లించాల్సి ఉందని తెలిసింది. 2024లో ఎరువులు, విత్తనాల అమ్మకం నుంచి రూ.14,500 దారి మళ్లించారు. 2019లో ఎరువుల అమ్మకం కోసం వైఎస్సార్ యూనివర్సిటీ నుంచి రూ.83,600 బకాయి ఉన్నట్లు చూపించారు. కానీ అప్పటి నుంచి వారి నుంచి నగదు రాలేదు.

ఇదిలా ఉండగా, ఈనెల 17న విజయ్‌బాబు సస్పెండ్ అయిన విషయాన్ని సైతం ఆ శాఖ ఉన్నతాధికారులు బయటకు పొక్కకుండా దాచి ఉంచారు. సామాజిక మాధ్యమాల ద్వారా శుక్రవారం సాయంత్రం బయటకు తెలిసింది. విజయ్‌బాబు సస్పెన్షన్ విషయం గోప్యంగా ఉంచాలని.. సొసైటీలో కొందరిపై తీవ్ర ఒత్తిడి కొనసాగుతున్నట్లు సమాచారం.

యువత మత్తుకు బానిస కావొద్దు



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ శివనాయక్

చర్ల: యువత మత్తు పదార్థాలకు బానిస కావద్దని భద్రాచలం ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ శివనాయక్ సూచించారు. చర్లలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో చర్ల మండల యూత్ ఆధ్వర్యంలో మాదక ద్రవ్యాల వల్ల దుష్ప్రభావాలపై యువతకు అవగాహన కల్పించారు. చర్ల మండలంలో ఛత్తీస్‌గఢ్ రాష్ట్రానికి సరిహద్దున ఉన్నందున పిల్లలు డ్రగ్స్‌కు అలవాటు పడి వారి జీవితం నాశనం చేసుకుంటున్నారని జడ్జి తెలిపారు. విద్యార్థులు మాదక ద్రవ్యాల జోలికి వెళ్లకుండా జీవిత లక్ష్యం వైపు పయనించి బంగారు భవిష్యత్తును ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. సదస్సులో చర్ల సీఐ ఏ.రాజువర్మ, ఎస్సైలు నర్సిరెడ్డి కేశవ్ భద్రాచలం బార్ అసోసియేషన్ సభ్యులు అంబేడ్కర్, అవులూరి సత్యనారాయణ, సాధనపల్లి సతీష్, భాష్యం శారద, దాట్ల సంధ్య, యలమందల జగదీష్, చల్లా శివకృష్ణ, ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ నరేంద్ర ప్రభుత్వ వైద్యులు డాక్టర్లు దివ్యనయన, రామకృష్ణ, నగేష్ ఎంఈఓ పీవీ రమణ చర్ల మండల యూత్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఇంజనీరింగ్ అధికారులతో ఎమ్మెల్యే సమీక్ష

మణుగూరుటౌన్: పినపాక నియోజకవర్గంలో ట్రైబల్ వెల్ఫేర్ ఇంజనీరింగ్ విభాగం ఆధ్వర్యంలో జరిగే అభివృద్ధి పనులు వేగంగా నాణ్యతతో జరిగేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు అన్నారు. శనివారం ప్రజాభవన్‌లో నియోజకవర్గ అధికారులతో సమావేశమై మాట్లాడారు. ఎస్టీఎస్‌డీఎఫ్‌తో పాటు ఇతర గ్రాంట్లకు నుంచి 176 పనులకు రూ.203.85 కోట్లు వ్యయంతో పనులు జరుగుతున్నాయని, వాటిలో 45 పనులు పూర్తవగా, 58 పనులు జరుగుతున్నాయని, మరో 57 పనులు ప్రారంభించాల్సి ఉందని అధికారులు వివరించారు. అధికారులు పనులు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ ఉండాలని, ప్రారంభం కావాల్సిన 57 వర్కులను వీలైనంత త్వరగా ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేయాలన్నారు. ఏవైనా సమస్యలుంటే తన దృష్టికి తీసుకురావాలని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో అధికారులు డీఈ మధుకర్, ప్రసాద్, శ్రీకాంత్ తదితరులు ఉన్నారు.

కూలీలకు పనిముట్లు పంపిణీ

పినపాక: మండల పరిషత్ కార్యాలయంలో జాతీయ ఉపాధి హామీ కూలీలకు శనివారం ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు చేతుల మీదగా పారలు, బొచ్చల పంపిణీ చేశారు. పొలాలకు రహదారులు, ఇంకుడు గుంతలు వంటివి ఉపాధి హామీ పథకంలో చేర్చాలని అధికారులను ఆదేశించారు. తహసీల్దార్ గోపాలకృష్ణ, ఏడీఏ తాతారావు, ఎంపీడీఓ సునీల్ కుమార్, ఏఓ వెంకటేశ్వర్లు, మండల అధ్యక్షుడు రామనాథం, కంది సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా..

వైద్యశాలలో తనిఖీ

దుమ్ముగూడెం: మండలంలోని నర్సాపురం ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని జిల్లా టీబీ, లెప్రసీ, ఐడీఎస్పీ అధికారి డాక్టర్ పుల్లారెడ్డి శనివారం ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా టీబీ ప్రోగ్రాంకు సంబంధించిన రికార్డులను పరిశీలించి, ఇంటెన్సిఫైడ్ టీబీ ముక్త్ భారత్ అభియాన్ ప్రోగ్రాంకు సంబంధించిన ప్రోగ్రెస్ కు సంబంధించి సూచనలు చేశారు. స్వస్థ నారీశక్తి పరివార్ కార్యక్రమంలో భాగంగా ఎంతమంది మహిళలు తమడ పరీక్షలు చేయించుకుంటున్నారు అని ఆరా తీశారు. అనంతరం ఫార్మసీ విజిట్ చేసి టీబి ట్రీట్మెంట్ రిజిస్టర్, మందులు అందుబాటు గురించి చెక్ చేశారు.ఈ కార్యక్రమంలో డాక్టర్ సుభాష్, వైద్యసిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

స్టేషనరీ పంపిణీ



విద్యార్థులకు నోటు పుస్తకాలు, బ్యాగులు పంపిణీ చేస్తున్న వెంకటరెడ్డి

అశ్వాపురం: మండల పరిధిలోని వెంకటాపురం గ్రామంలో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు శ్రీ సుబ్రహ్మణ్య ఆగ్రో ఏజెన్సీస్ వారి ఆధ్వర్యంలో స్పిక్ కంపెనీ సౌజన్యంతో డాక్టర్ సోమ నితిష్‌రెడ్డి జన్మదినం సందర్భంగా శనివారం 80 మంది విద్యార్థులకు ఉచితంగా నోట్ పుస్తకాలు, బ్యాగులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో స్పిక్ కంపెని మేనేజర్ శ్రీకాంత్‌రెడ్డి, కూసుకుంట్ల శ్రీనివాస్‌రెడ్డి, సోమ నితిష్‌రెడ్డి, మడకం శరత్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మెగా రక్తదాన శిబిరం

మణుగూరురూరల్: పీఎం నరేంద్రమోదీ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని బీజేపీ ఆధ్వర్యంలో స్థానిక స్నేహగార్డెన్స్‌లో ఏర్పాటు చేసిన మెగా రక్తదాన శిబిరాన్ని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు బైరెడ్డి ప్రభాకర్ రెడ్డి శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశ రక్షణతో పాటు ప్రజల సంక్షేమం, అభివృద్ధికి నిరంతరం పాటుపడుతున్న వ్యక్తి ప్రధాని నరేంద్రమోదీ అన్నారు. బీజేపీ నాయకులు పొడియం బాల రాజు, ముస్కు శ్రీనివాస్‌రెడ్డి, పున్నం బిక్షపతి, లింగంపల్లి రమేష్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యార్థులకు ప్రశంసాపత్రాలు

అశ్వారావుపేటరూరల్: వన మహోత్సవంలో భాగంగా దేశ ప్రధాని ఇచ్చిన పిలుపు మేరకు విద్యార్థులు నాటిన మొక్కలకు ప్రశంసా పత్రాలను అందించారు. శనివారం అశ్వారావుపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో కాంప్లెక్స్ హెచ్ఎం పీ హరిత మాట్లాడుతూ.. అమ్మ పేరుతో ఒక మొక్క (ఏక్ పేడ్ పర్ మాకే నామ్) నినాదంతో పాఠశాల విద్యార్థులచే వివిధ రకాల మొక్కలను నాటించామని, ఆ తర్వాత విద్యార్థులు నాటిన మొక్కలు వాటి వివరాలను ఫొటోలతో సహా ఆన్‌లైన్‌లో పొందుపరిచామని తెలిపారు. ఎకో క్లబ్ ఫర్ మిషన్ లైఫ్ సంస్థ విద్యార్థులకు ప్రశంసాపత్రాలను పంపించడంతో ఆయా పత్రాలను విద్యార్థులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సీఆర్‌పీ ప్రభాకరాచార్యులు, నర్సింహారావు, కట్టా శ్రీను, పూర్ణచంద్రరావు, దుర్గయ్య, మధుబాబు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే పరామర్శ

అశ్వాపురం: మండలంలో పలువురు కుటుంబాలను బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు శనివారం పరామర్శించారు. మండల పరిధిలోని మిట్టగూడెం గ్రామంలో కొర్సా మంగయ్య కుటుంబాన్ని, పాండ్రు సతీష్‌ను పరామర్శించారు. మల్లెలమడుగు గ్రామంలో మండ్రు నరసింహారావును, కొండా తిరుపతయ్య సతీమణిని పరామర్శించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు కోడి అమరేందర్, ప్రధాన కార్యదర్శి మర్రి మల్లారెడ్డి, నాయకులు చల్లా రాజేష్, కొర్సా దుర్గారావు, చావా రాఘవులు, గుంపెన శ్రీను, కోడి గంగన్న, సురేందర్‌రెడ్డి, తూము రాఘవులు, మామిడి శ్రీను, పున్నరావు, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలో పేరెంట్స్ మీటింగ్

ములకలపల్లి: మండలపరిధిలోని తిమ్మంపేట గ్రామంలోని ప్రాథమికోన్నత పాఠశాలలో శనివారం పేరెంట్స్ మీటింగ్ నిర్వహించారు. హెచ్ఎం శంకర్ మాట్లాడుతూ.. విద్యార్థులను క్రమం తప్పకుండా పాఠశాలకు పంపించాలని సూచించారు. విద్యార్థులలో సృజనాత్మకత, మరియు సామర్థ్యాలు నిరూపించుకునేందుకు తల్లిదండ్రుల, ఉపాధ్యాయుల సమావేశం ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు.

పలువురికి ఎమ్మెల్యే పరామర్శ

దుమ్ముగూడెం: మండలంలో ఇటీవల మృతి చెందిన పలు గ్రామాలలోని బాధిత కుటుంబాలను భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు శనివారం పరామర్శించారు.మండలంలోని చిన్న బండి రేవు, సీతారాంపురం గ్రామాల్లో ఇటీవల కాలంలో అనారోగ్యంతో మరణించిన వారి కుటుంబ సభ్యులను పరామర్శించి మనోధైర్యం ఇచ్చి వారి చిత్రపటాలకి పూలమాల వేసి నివాళులర్పించారు. మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ తెల్లం సీతమ్మ, కాంగ్రెస్ నాయకులు లంకా శ్రీనివాసరావు, అన్నె సత్యనారాయణమూర్తి, మట్టా శివాజీ,కొండపల్లి నరేంద్ర, వెంకటేష్, శ్రీకాంత్‌లు పాల్గొన్నారు.

విద్యార్థినికి సైకిల్ వితరణ



విద్యార్థినికి సైకిల్ వితరణగా అందజేసిన ఉపాధ్యాయుడు, హెచ్ఎం..

దమ్మపేట: ప్రతి రోజు సుమారుగా ఐదు కిలో మీటర్ల దూరం కాలినడకన పాఠశాలకు వస్తున్న విద్యార్థినికి, అదే పాఠశాల ఉపాధ్యాయుడు శనివారం సైకిల్‌ను వితరణగా అందజేశారు. మండలంలోని మల్లిగూడెం గ్రామానికి చెందిన నల్లగొర్ల జానకి, సుమారు ఐదు కిలో మీటర్ల దూరంలోని నాచారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏడవ తరగతి చదువుతుంది. ఈ క్రమంలో ఆ విద్యార్థిని, ప్రతిరోజు పాఠశాలకు కాలినడకన వెళ్తుంది. ఈ విషయాన్ని గమనించిన ఆ పాఠశాల భౌతిక శాస్త్ర ఉపాధ్యాయుడు దారావత్ కృష్ణ, శనివారం తన కుమారుడి పుట్టిన రోజు సందర్భంగా, ప్రతిరోజు పాఠశాలకు రావడానికి వీలుగా జానకికి సైకిల్‌ను వితరణగా అందజేశారు. ఉపాధ్యాయుడిని గ్రామస్తులు, తోటి ఉపాధ్యాయులు అభినందించారు. హెచ్ఎం జగపతి, ఉపాధ్యాయులు శివాజీ, అప్పారావు, జ్యోతి, మోహినికుమారి పాల్గొన్నారు.

ఇద్దరు విద్యార్థులకు ఎంబీబీఎస్ సీటు



శీలం దీప్తి



సాయివర్ధన్

దుమ్ముగూడెం: లచ్చిగూడెంకు చెందిన ఆదివాసీ బిడ్డ హైదరాబాద్‌లోని గాంధీ ప్రభుత్వ వైద్య కళాశాలలో ఎంబీబీఎస్ ఫ్రీ సీటును సాధించింది. నీట్-2025లో ఆల్ ఇండియా స్థాయిలో 95053 ర్యాంకు, రాష్ట్ర స్థాయిలో 1288 ర్యాంకు, రాష్ట్ర ఎస్టీ కేటగిరిలో 50వ ర్యాంకు సాధించింది. తండ్రి ముదరాజు చనిపోగా తల్లి తులసీ వైద్యశాఖలో హెచ్‌వీగా విధులు నిర్వహిస్తూ కూతురిని చదివిస్తోంది.

వినాయకపురం వాసికి..

అశ్వారావుపేటరూరల్: మండలంలోని వినాయకపురం కాలనీ గ్రామానికి చెందిన పెంబుల సాయివర్ధన్ అనే విద్యార్థికి ప్రభుత్వ మెడికల్ కళాశాలలో ఎంబీబీఎస్ ఫ్రీ సీటు లభించాడు. గ్రామానికి చెందిన ప్రసాదరావు-రుక్మిణి దంపతుల కుమారుడు సాయివర్ధన్ నీట్‌లో రాష్ట్ర స్థాయిలో 5186 ర్యాంక్ సాధించగా, ఆల్ ఇండియా ర్యాంక్ 223389 వచ్చింది. మహబుబాద్‌లోని ప్రభుత్వ మెడికల్ కళాశాలలో సీటును దక్కించుకున్నారు.

ముందస్తు బతుకమ్మ సంబురాలు

దసరా సెలవులు రావడం, శనివారం చివరి వర్కింగ్‌డే కావడంతో ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థల్లో ముందస్తుగా బతుకమ్మ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. పాఠశాలల్లో పనిచేస్తున్న మహిళ ఉపాధ్యాయులు, విద్యార్థులు తీరొక్క పూలతో బతుకమ్మలను చూడచక్కని రీతిలో పేర్చగా.. ఆటపాటలతో సందడి చేశారు. పాఠశాల హెచ్ఎంలు, ఇతర ఉపాధ్యాయులు మాట్లాడుతూ.. బతుకమ్మ పండుగ ఆవశ్యకత, విశిష్టతలతో పాటుగా తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాల గురించి వివరించారు. కాగా, కొన్నిప్రాంతాల్లో స్థానిక అధికారులు వేడుకల్లో పాలుపొందారు. – సాక్షి నెట్‌వర్క్



అశ్వారావుపేటరూరల్: ఉన్నత పాఠశాలలో బతుకమ్మ సంబరాలు



మణుగూరుటౌన్: శ్రీవిజ్ఞాన్‌లో రావణ వధ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే పాయం



అశ్వారావుపేటరూరల్: అంగన్‌వాడీ కేంద్రంలో బతుకమ్మ ఆడుతున్న మున్సిపల్ కమిషనర్ నాగరాజు



దమ్మపేట: అంకంపాలెం ఆశ్రమ పాఠశాలలోని బతుకమ్మ సంబురాలలో ఉపాధ్యాయులు



చండ్రుగొండ: బతుకమ్మ ఆడుతున్న ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లులు



చర్ల: కుదునూరులోని పీఎంశ్రీ ఎంపీపీఎస్ పాఠశాలలో వేడుకలు..



మణుగూరురూరల్: బతుకమ్మలను పేర్చుతున్న దృశ్యం



భద్రాచలంటౌన్: బతుకమ్మ సంబురాల్లో పాల్గొన్న ప్రిన్సిపాల్, తదితరులు



పినపాక ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులతో కలిసి ఉపాధ్యాయుల బతుకమ్మ వేడుకలు..



ములకలపల్లి: బతుకమ్మలతో చిన్నారులు, ఉపాధ్యాయులు